ఓంశ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా!

గడచిన ఏడు దినములనుండి రామచింతన ఎంతయో ఆనందంగా జరిగింది. వచ్చిన వ్యక్తులు, పురోహితులు చక్కగా భక్తిశ్రద్ధలతో సప్తాహమును జయప్రదం గావించారు. దీనిని ఏర్పాటుచేసిన శెట్టిగారుకూడను చాలా అనుకూలముగావించి ఆనందాన్ని చేకూర్చారు. నిరంతరం రామచింతన చేస్తుంటే గ్రామమంతా సుక్షేమంగా ఉంటుంది. ఒంటరిగా కూర్చొని రామచింతన చేస్తుంటే అది అంత రుచిగా ఉండదు. అనేకమంది ఒకచోట చేరి రామచింతన చేసినప్పుడు ఏ ఒక్కరి మనసైనా రాముని హృదయాన్ని కరగిస్తుంది. తద్వారా అందరికీ రాముని అనుగ్రహం లభిస్తుంది. కనుక, రామచింతన వ్యష్టిగా చేయటంకంటే సమిష్టిగా చేయటం చాలా ఉత్తమం. రామచింతన అందరూ చేయగలిగినటువంటిది. కన్నులు కనిపించనివాడు కూడా, 'రామా, రామా, రామా' అని స్మరిస్తుంటారు. 'రామ' అనేది ఒక వ్యక్తియొక్క పేరు కాదు. అది వ్యష్టిస్వరూపం కాదు. ఆత్మకే 'రామ' అని పేరు. అందరియందుకూడను ఆత్మారాముడున్నాడు. కనుక, చిన్నపిల్లలు మొదలుకొని పెద్దవారివరకు అందరూ రామచింతనచేయాలి. ధనముగాని, ఆస్తిపాస్తులుగాని మనకు శాంతి, సంతోషములను అందించవు. నామచింతనే అన్నిటికంటే ఉత్తమమైనది. నామచింతన చేస్తుంటే సర్వచింతలూ నివారణ అవుతాయి.

పుట్టుట ఒక చింత, భూమినుండుట చింత
　　సంసారమొక చింత, చావు చింత
బాల్యమంతయు చింత, వార్థక్యమొక చింత
　　జీవించుటొక చింత. చెడుపు చింత
కర్మలన్నియు చింత, కష్టంబులొక చింత
　　సంతసమొక చింత, వింత చింత
సర్వచింతల బాపెడి రామభక్తి
గొనుచు ఇకనైన జనులార కోర్కెమీర.

కనుక, ఏ చింతలు వచ్చినా రామచింతన చేయండి. ఇది ఈనాడు పుట్టినది కాదు. అనేక వేల సంవత్సరాల క్రితం దశరథుడు రామచింతనను ప్రారంభించాడు. ఆయనకు కౌసల్యద్వారా మొట్టమొదట ఒక ఆడబిడ్డ పుట్టింది. ఆమెకు 'శాంత' అని పేరు పెట్టారు. ఆమెను దశరథుడు తన స్నేహితుడైన రోమపాదునికి దత్తత యిచ్చాడు. రోమపాదుడు శాంతను ఋష్యశృంగునికిచ్చి వివాహం చేశాడు. దశరథుడు పుత్రకామేష్టి క్రతువును ఆచరించినప్పుడు ఋష్యశృంగుడు, శాంత ఇరువురూ అయోధ్యకు వచ్చారు.

కైకను వివాహమాడటానికి పూర్వం దశరథుడు ఆమెకు పుట్టబోయే కుమారునికే పట్టం కడతానని ఆమె తండ్రియైన కేకయరాజుకు వగ్దానంచేశాడు. 'నాకు కౌసల్య, సుమిత్ర అనే ఇరువురు భార్యలున్నారు. కాని, నాకు ఇంతవరకు పుత్రసంతానం కలుగలేదు. రాజ్యపరిపాలన నిమిత్తం నాకొక వారసుడు కావాలి. కాబట్టి, మీ కుమార్తెను నాకిచ్చి పెండ్లిచేయండి' అని దశరథుడు కోరినప్పుడు కేకయరాజు, 'దశరథా! నీవు నా కుమార్తెకు పుట్టబోయే కుమారునికి పట్టాభిషేకం చేసేటట్లయితే ఆమెను నీకిచ్చి పెండ్లి చేస్తాను' అన్నాడు. తప్పక అట్లే చేస్తానన్నాడు దశరథుడు. ఇక్ష్వాకువంశమువారు ఆడిన మాట తప్పరు.

దశరథుని వివాహమాడి కైకేయి అయోధ్యకు వచ్చింది. కాని, ఆమెకూడా సంతానం కలుగకపోయేసరికి దశరథుడు పుత్రకామేష్టి క్రతువు ఆచరించాడు. ఆ అగ్నిహోత్రమునుండి ఒక మహాపురుషుడు ప్రత్యక్షమై ఒక పాయసపు పాత్రనిచ్చాడు. దశరథుడు ఆ పాయసాన్ని తన ముగ్గురు రాణులకూ సమానంగా పంచాడు. అయితే, కౌసల్యకు ఒక కుమారుడు, కైకకు ఒక కుమారుడు, సుమిత్రకు మాత్రం ఇద్దరు కుమారులు కలిగారు. దీనికి కారణమేమిటి? ఎవరూ దీనిని సరిగా వివరించలేదు.

కౌసల్య, కైకేయిలు తమ పాయసపు గిన్నెలను అందుకొని తమ పూజా మందిరములకు వెళ్ళారు. కౌసల్య తాను పట్టపురాణి కనుక తనకు పుట్టిన కుమారునికే పట్టాభిషేకం జరుగుతుందని ఆశించింది. కేకయరాజుకు దశరథుడు ఇచ్చిన వాగ్దానం ప్రకారం తనకు పుట్టబోయే కుమారునికి పట్టాభిషేకం జరుగుతుందని భావించి కైక ఆనందంగా ఉంది. అయితే, సుమిత్రకు మాత్రం తనకు పుట్టబోయే పుత్రునికి అటువంటి అవకాశం లేదని తెలుసు. ఆమె శిరస్నానంచేసి, కురులార్పుకోవటానికి మిద్దెపైకి వెళ్ళింది. ఆనాడు ఫ్యాన్లు, హెయిర్‌డ్రైయర్లు లేవు కదా! తన పాయసపు గిన్నెను మిద్దెపైన పెట్టి ఆమె కురులార్పుకుంటున్న సమయంలో ఎక్కడినుండో ఒక గ్రద్ద వచ్చి ఆ గిన్నెను తన్నుకొనిపోయింది. 'అయ్యో!పాయసపు గిన్నె పోయిందే. నాథుడు కోప్పడతాడోయేమో' అని బాధపడుతూ క్రిందికి పరుగెత్తుకొని వచ్చింది. కౌసల్య, కైకేయిలు ఆమెను ఓదార్చుతూ, 'నీవేమీ బాధపడకు. మా పాయసంలో కొంతభాగం నీకిస్తాము' అని అన్నారు. కౌసల్య తన పాయసంలో అర్థభాగం గిన్నెలో పోసింది. కైకేయికూడా తన పాయసంలో అర్థభాగం అందులో పోసి సుమిత్రకు అందించింది. ఆనాడు సవతులుకూడను ఎటువంటి భేదములూ లేకుండా పరస్పరం ఎంతో ప్రేమగా ఉండేవారు. ముగ్గురూ తమ పాయసపు గిన్నెలను తీసుకొని దశరథుని దగ్గరకు వెళ్ళి నమస్కరించారు. వసిష్ఠులవారుకూడా వచ్చి ఆశీర్వాదం

చేయగా ఆ పాయసమును త్రాగారు. తరువాత ముగ్గురూ గర్భం దాల్చారు.

కౌసల్యకు రాముడు పుట్టాడు. కైకకు భరతుడు పుట్టాడు. సుమిత్రకు లక్ష్మణ, శతృఘ్నులు పుట్టారు. లక్ష్మణ, శతృఘ్నులు పుట్టినప్పటినుండి పాలు త్రాగరు, నిద్ర పేరు. ఒకటే ఏడుపు, ఏడుపు, ఏడుపు. మందుల వలనగాని, మంత్రయంత్రముల వలనగాని ఫలితం లేకపోయింది. అప్పుడు సుమిత్ర వసిష్ఠులవారి దగ్గరకు వెళ్ళి చాలా బాధపడుతూ తన బిడ్డల పరిస్థితిని వివరించింది. ఆయన కొద్దిసేపు ధ్యానంలో కూర్చొని, 'అమ్మా! నీవేమీ బాధపడవద్దు. నీ పెద్ద కుమారుని రాముని తొట్టెలో పరుండబెట్టు, రెండవ కుమారుని భరతుని తొట్టెలో పరుండబెట్టు' అని సలహా యిచ్చారు. సుమిత్ర వసిష్ఠులవారి సలహానునసరించి లక్ష్మణుని రాముని ప్రక్కన, శతృఘ్నుని భరతుని ప్రక్కన పరుండబెట్టేసరికి వారిరువురూ ఏడ్పు మాని ఆనందంతో కేరింతలు కొట్టసాగారు.

దీని అంతరార్థమేమిటి? కౌసల్య సుమిత్రకు తన పాయసంలో అర్థభాగం యిచ్చింది కదా. ఆ భాగమునుండి పుట్టినవాడు లక్ష్మణుడు. అతను రాముని అంశము కాబట్టి రాముని అనుసరిస్తూ వచ్చాడు. అట్లే, కైక యిచ్చిన పాయసమునుండి పుట్టినవాడు శతృఘ్నుడు. అతను భరతుని అంశము కాబట్టి భరతుని అనుసరిస్తూ వచ్చాడు. రాముని తరువాత భరతుడు పుట్టాడు. కనుక, భరతుడు రెండవ వాడు. లక్ష్మణుడు మూడవ వాడు. మూడవవాడైనప్పటికీ తాను రామునియొక్క అంశము కనుక రామునితోనే చేరిపోయాడు. అదేవిధముగా శతృఘ్నుడు ఎల్లప్పుడూ భరతుని జతలో ఉన్నాడు. రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు నల్గురూ ఎంతో అన్యోన్యంగా పెరుగుతూ వచ్చారు. రాముడు రాజైనప్పుడు లక్ష్మణుడు అతనికి మంత్రిగా ఉండి సేవ చేస్తాడని, అట్లే శతృఘ్నుడుకూడా భరతునికి సేవచేయగలడని భావించి సుమిత్ర ఎంతో ఆనందించింది.

సుమిత్ర పాయసపు గిన్నెను తన్నుకొనిపోయిన గరుడపక్షి దానిని ఒక పర్వంతంపైన వదలిపెట్టగా అది అంజనాదేవికి చిక్కింది. ఆ పాయసాన్ని భుజించటంచేత ఆమెకు ఒక కుమారుడు పుట్టాడు. అతనే హనుమంతుడు. రామలక్ష్మణుల అరణ్యంలో సీతాన్వేషణ సల్పుతున్న సమయంలో అతడు వారిని కలుసుకోవటం జరిగింది. వారిమధ్య సన్నిహిత సంబంధబాంధవ్యము ఏర్పడింది. హనుమంతుడు రామలక్ష్మణులను సుగ్రీవుని వద్దకు తీసుకు వెళ్ళగా సుగ్రీవుడు అరణ్యంలో వానరులకు దొరికిన ఒక నగలమూటను తెచ్చి రామునికి చూపించాడు. సీత తాను రావణునిచేత అపహరణకు గురి అవుతున్న సమయంలో క్రిందికి వదలిపెట్టిన నగలమూట అది. ఈనాటి భర్తలైతే ఉన్న నగలన్నీ లిప్టువేస్తారు. కాని, రాముడు ఆవిధంగా లి,ప్టీవేయలేదు. 'లక్ష్మణా! ఈ నగలు మీ వదినగారివేనా? చూడు' అన్నాడు. లక్ష్మణుడు ఆ నగలు చూచి, 'అన్నా! ఈ నగలు ఎవరివో నాకు తెలియదు. కాలియందెలు మాత్రం సీతమ్మవేనని నాకు తెలుసు. నిత్యమూ పాదనమస్కారం చేసికొనే సమయంలో నేను చూచాను' అన్నాడు.

సీతారామలక్ష్మణులు పంచవటీ తీరమున ఉన్న సమయంలో రావణుని ఆదేశము వేరకు మారీచుడు ఒక బంగారుజింక రూపంలో వచ్చి పర్ణశాల ముందు తిరుగాడుతూ సీత దృష్టిని ఆకరిషంచాడు. తన వినోదార్థం దానిని పట్టి తీసుకురావలసిందిగా సీత రాముని కోరటంతో రాముడు లక్ష్మణుని ఆమెకు రక్షణగా ఉంచి, ఆ మాయామృగాన్ని తరుముతూ వెళ్ళాడు. మరొక సమయంలో రామునికి చిక్కినట్లే సమీపిస్తూ, మరొక సమయంలో అతిదూరంగా పరుగెడుతుంటే, చివరికి రాముడు ఒక అస్త్రమును ప్రయేగించాడు. అది తగిలిన తక్షణమే మారీచుడు తన నిజస్వరూపాన్ని ధరించి రాముని గొంతునుకరిస్తూ, 'హా సీతా! హాలక్ష్మణా!' అని అరుస్తూ నేలకూలాడు. ఆ మాటలు విన్న సీత, 'లక్ష్మణా! మీ అన్నగారు ఏదో ఆపదలో చిక్కుకున్నట్లున్నారు. తక్షణమే నీవు ఆయనకు సహాయంగా వెళ్ళు' అని తొంధరపెట్టింది. అది కేవలం రాక్షసమాయ అనీ, రామునికి ఎటువంటి ఆపదా సంభవించదని లక్ష్మణుడు ఎంతగా ధైర్యం చెప్పినప్పటికీ ఆమె వినిపించుకోలేదు. చివరికి సీత ఆడిన కఠినోక్తులను భరించలేక లక్ష్మణుడు ఆమెను ఒంటరిగా వదలివెళ్ళక తప్పలేదు. తాను వెళ్ళే సమయంలో పర్ణశాల చుట్టూ ఒక గీత గీసి, 'ఈ గీత దాటి లోపలకి వచ్చినటువంటి వాడు మరణించునుగాక' అన్నాడు. దానిని దాటి బయటకు రావద్దని సీతకు చెప్పి తాను బయలుదేరి వెళ్ళాడు.

లక్ష్మణుడు వెళ్ళిన కొద్దిసేపటికి రావణాసురుడు ఒక సన్యాసి వేషంలో వచ్చి, 'భవతీ భిక్షాం దేహి' అన్నాడు. సీత లక్ష్మణుడు గీసిన గీతను దాటకుండా అటువైపునుండి అన్నం పెట్టింది. 'అయ్యో! అంత దూరంగా పెడితే ఎలా? నాకు చాలా ఆకలిగా ఉందే. అడుగు ముందుకు వేయలేను' అంటూ రావణుడు చాలా నాటకమాడాడు. దగ్గరకు వచ్చి పెట్టమన్నాడు. సీత గీతను దాటివచ్చిన తక్షణమే వాడు తన నిజరూపం ధరించి, ఆమెను అపహరించి లంకకుగొనిపోయాడు. ఆమెను అశోకవనంలో ఉంచి చుట్టూకొందరు రాక్షసస్త్రీలను పెట్టాడు. 'పాపిష్ఠి మృగమేలవచ్చెనో, దాన్ని తెమ్మని మోసపోతినే' అని సీత చాలా బాధపడుతూ వచ్చింది. అప్పుడు బాధపడి ప్రయోజనమేమిటి? కష్టాలు కలిగే సమయంలో ఇలాంటి కోరికలు పుడుతుంటాయి. అయితే, విభీషణుని భార్య సరమ, అతని ఇరువురు బిడ్డలు మాత్రం సీతను చాలా జాగ్రత్తగా చూచుకుంటూ, ఆమె దుఃఖపడకుండా మంచిమాటలు చెబుతూ వచ్చారు. ఈవిధంగా వారు తనను కాపాడుతూ రావటంచేతనే సీత అశోకవనంలో ధైర్యంగా ఉండగలిగింది. 'ఈ లంకలోకూడా ఇంత మంచివారున్నారా!' అని ఆమెకు ఆశ్చర్యం కలిగింది. సీతను ముట్టుకుంటే తాను భస్మమైపోతానని రావణునికి తెలుసు. కనుక, వాడు మాటలతో ఆమెను లోబరచుకోవాలని అనేకవిధాలుగా ప్రయత్నించాడు. కాని, సీత వాని మొహంకూడా చూడలేదు. వాడు రాముని దూషిస్తుంటే ఆమె గడ్డిపోచను తీసి వానిముందు వేసి, 'నీవు రాములముందు ఈ గడ్డిపోచకంటే హీనుడవు' అన్నది.

ఇక్కడ సీతయొక్క పూర్వజన్మ వృత్తాంతాన్ని మీరు కొంత తెలుసుకోవాలి. ముందు జన్మలో సీత పేరు వేదవతి. ఆమె విష్ణుమూర్తిని వివాహమాడాలనే కోరికతో తపస్సుచేస్తూవచ్చింది. ఒకనాడు రావణుడు ఆమెను చూచి తనవెంట లంకకు రమ్మన్నాడు. ఆమె తిరస్కరించింది. వాడామె జడను పట్టుకొని లాగాడు. తక్షణమే ఆమె యోగాగ్ని సృష్టించుకొని, 'వచ్చే జన్మలో నేను విష్ణుమూర్తిని వివాహమాడి లంకకు వచ్చి నీ వంశాన్ని నాశనముచేస్తాను. నీ చేతికి నా వెంట్రుకలు ఎన్ని చిక్కినాయో అంతమంది రాక్షసులు భస్మమైపోతారు' అని పలికి ఆ అగ్నిలో తాను దగ్ధమైపోయింది. రావణుని చేతిలో ఆమె వెంట్రుకలు మిగిలిపోయాయి. ఆ వేదవతియే సీతగా పుట్టి లంకకు వెళ్ళింది. సీతకు వైదేహి అని పేరు. వైదేహి అనగా దేహాభిమానం లేనటువంటిది. రామాయణంలో ఇట్టి సూక్ష్మమైన రహస్యాలు చాలా ఉన్నాయి.

హనుమంతుడు సీతాహరణం తరువాతనే రాములను కలిసాడు. అంతకుముందెన్నడూ తాను సీతను చూడలేదు. అటువంటి వాడిని సీతకు వెతికి రమ్మని లంకకు పంపితే, ఎవరని వెతికేది? అతడు సీతకోసం రావణుని అంతఃపురమంతా తిరిగాడు. 'హనుమంతతుడు బ్రహ్మచారికదా! అంతఃపురంలో ఉన్నటువంటి రాక్షస స్త్రీలంతా చాలా వికారంగా ఉంటారు. వాళ్ళ డ్రస్సులు సరిగా ఉండవు. అటువంటి చోటికి హనుమంతుడు ఎలా వెళ్ళాడు?' అని కొందరు ప్రశ్నిస్తారు. అతన దృష్టి ఆ స్త్రీలపై ఏమాత్రమూ లేదు. కేవలం రాముని ఆజ్ఞను శిరసావహించి, 'ఎక్కడ ఉంది సీతామాత' అని వెతుకుతూపోయాడు. ఎటువంటి దృశ్యమును చూచినప్పటికిని అతని మనస్సు ఏమాత్రం చలించలేదు. కనుకనే, హనుమంతుడు సత్యబ్రహ్మచారి. 'శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు హనుమంతుడు'. అట్టి గుణవంతుడు, బలవంతుడు ఎవ్వరూ ఎక్కడా కనిపించటం లేదు. రాముని వంటి ప్రభువు, హనుమంతుని వంటి దాసుడు ఎక్కడా లేనేలేరు. ఎక్కడ చూచినా సీతారామలక్ష్మణులతోబాటు హనుమంతుడుకూడా దర్శనమిస్తాడు. భజనలో మా పిల్లలు 'రామలక్ష్మణజానకీ...జైబోలో హనుమాన్‌కీ' అని పాడుతున్నారు. 'రామలక్ష్మణజానకి' అన్నప్పుడు హనుమంతుని పేరుకూడా ప్రత్యేకంగా చెబుతున్నారు. the end of education is character. ఈ శీలమనేది రాములయందు, హనుమంతునియందు మనకు చక్కగా గుర్తించటానికి వీలవుతుంది. వీరిని మనము ఆరాధించినప్పుడు మనకుకూడా అటువంటి సద్బుద్ధి, సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తన అలవడుతాయి. కనుక, మీరు నిరంతం రాములను, హనుమంతుని తలచుకుంతూరండి. కష్టసమయాల్లో కూడను వారిని తలచుకోండి. 'కృష్ణా' అన్నా, 'రామా' అన్నా, హనుమంతుజన్నా, శివుడన్నా, విష్ణువన్నా ఏ పేరు చెప్పినా దేవుడు ఒక్కడే. మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే, శృంగారములు వేరి బంగారమొక్కటే, పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటే' అదేవిధంగా, రూపనామములు వేరుగాని, భగవంతుడు ఒకడే. నీ పేరేమని ఎవరినైనా అడిగితే ఒకరు రామయ్య అంటారు, ఒకు లక్ష్మయ్య అంటారు, ఒకరు మారెప్ప అంతారు, ఒకరు గోవిందయ్య అంటారు. కాని, ఇదే ప్రశ్న భగవంతుని అడిగితే 'అహం బ్రహ్మాస్మి' అంటాడు. నేను ఆత్మను. నాకు వేరే పేరు లేదు. ఆత్మ గుణాతీతమైనది. కనుకనే, భగవత్తత్త్వాన్ని ఈరీతిగా వర్ణించారు.

నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలం అచలం సర్వధీసాక్షిభూతం
భావాతీతం త్రిగుణ రహితం....

భగవంతునికి ఎట్టి గుణములూ లేవు. జనన మరణములూ లేవు. అసలు భగవంతుడంటే ఎవరు? 'దైవం మానుష రూపేణ'. కాబట్టి, అందరూ భగవత్స్వరూపులే. నిన్ను ఎవరు అడిగినా 'నేను భగవంతుడను' అని చెప్పాలి. రామయ్య, లక్ష్మయ్య అనేవి మీ తల్లిదండ్రులు పెట్టిన పేర్లేగాని, పుట్టిన పేర్లు కావు. నిజానికి, రాముని వేషం వేసినా, కృష్ణుని వేషం వేసినా, శివుని వేషం వేసినా అన్నీ మానవునికే వేస్తున్నారు. భగవంతుడు ప్రతి మానవునియందు ఆత్మస్వరూపుడై ఉన్నాడు. 'ఏకాత్మా సర్వభూతాంతరాత్మ'. అన్ని భూతములయందుకూడను ఒకే భగవంతుడున్నాడు. పేర్లు, రూపములు వేరువేరుగా మీకు కనిపించవచ్చు.కాని, భగవంతుడు ఒక్కడేయని మీరు విశ్వసించండి. ఎవ్వరిని చూచినా అందరిలోనున్న ఆత్మ ఒక్కటే అనే భావనతో నమస్కరించండి. ఒక బెగ్గర్‌ని చూచినా నమస్కారం చేయండి. అతను దేహదృష్టిలో బెగ్గర్ కావచ్చుగాని ఆత్మదృష్టిలో బిగ్గర్.

ఎవ్వరినీ మనము ద్వేషులుగా, శత్రువులుగా భావించరాదు. అందరిలో ఉన్నది నీవే. కనుకనే, ప్రతి ఒక్కరూ కూడను నేను అంటున్నారు. 'ఇది నా దేహము, చిత్తము' అంటున్నావు. 'నాది' అన్నప్పుడు 'నేను' ప్రతేయకంగా ఉండాలికదా. ఆ 'నేను' ఎవరు? అదే దైవత్వము. ఆ దైవత్వమునే మనం అన్ని పేర్లతో పిలుస్తున్నాము. కాని, మనము దేహాభిమానంచోను, అహంకారముతోను 'నేను' అనే మాటను ఉపయోగపెడుతున్నాము. ఈ I అనేదాని తల కొట్టేసినప్పుడు అది 'క్రాస్' అవుతుంది. అనగా, అహంకారమును త్యజించవలసినదిగా జీసస్ బోధించాడు. మనము కేవలం దేహమును దృష్టిలో పెట్టుకొని అన్నింటినీ 'నేను' అని అంటున్నాము. 'నేను వస్తున్నానీ', 'నేను పోతున్నాను' అని అంటున్నాము. వచ్చేదీ, పోయేదీ కేవలం దేహమే! 'నేను' మాత్రం అందరిలోనూ ఏకంగా ఉన్నది. అట్టి ఏకాత్మభావమును మీలో నిల్పుకోవాలి. అదియే నిజమైన భక్తి. 'నీవు వేరు, నేను వేరు' అని అనుకోకూడదు. ఆత్మదర్శనం

కావాలని కోరుకొనేవారు 'నేను-నాది' అనే సంకుచిత భావాన్ని విడిచిపెట్టాలి. 'మీరు-మేము' అనేటువంటి భేదము ఏమాత్రమూ ఉండకూడదు. మనమంతా ఒక్కటే. All are one be alike to everone. ఇదియే సర్వ గ్రంథాల సారము.